క్లుప్తంగా

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న రైల్వే సిబ్బంది

తాటిచెట్లపాలెం: డిజిటల్ చెల్లింపులపై ఈస్ట్ కోస్ట్ రైల్వే విస్తృత అవగాహన కల్పిస్తోంది. సులభతరమైన టికెటింగ్ ప్రక్రియ గురించి కమర్షియల్ సిబ్బంది రైళ్లు, బుకింగ్ కౌంటర్ల వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపుల ద్వారా సమయం ఆదా అవడంతో పాటు కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదని, ఈ కొత్త సదుపాయం వల్ల మరింత వేగంగా టికెట్లు తీసుకోవడం వీలవుతుందని కమర్షియల్ సిబ్బంది చెబుతున్నారు.

రేపు మార్గశిర మాస రాట మహోత్సవం



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం, సౌభాగ్య ప్రదాయిని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో డిసెంబర్ 2 నుంచి 30 వరకు మార్గశిర మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు శుభారంభ సూచికగా రాట మహోత్సవం ఈ నెల 12న జరపనున్నారు. ప్రతి ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సాంప్రదాయం ప్రకారం ఆ రోజు ఉదయం నాదస్వరాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఉత్సవం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఉత్సవాలు, సేవలు, దర్శనాలకు సంబంధించి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఆహ్వానించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

బకాయి వేతనాల కోసం 104 ఉద్యోగుల ధర్నా

సీతమ్మధార: గడచిన మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా 104 ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని, 2020 తర్వాత నియమితులైన వారికి జీవో నంబర్ ఏడు ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్‌లో యాజమాన్య వాటా యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, 3 సంవత్సరాల అలవెన్సుల్స, ఇంక్రిమెంట్ బకాయిలు చెల్లించాలని, వాహనాల నిర్వహణ (మరమ్మతులను) తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా నాయకుడు జి. అప్పలరాజు, అధ్యక్ష, కార్యదర్శులు తాతబాబు, భాస్కర్, జిల్లా కమిటీ నాయకులు భవ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుని కలిసిన వుడా చైర్మన్ ప్రణవ్ గోపాల్

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజుని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రణవ్ గోపాల్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక పాల్గొన్నారు.

మురళీరవం.. ఆధ్యాత్మిక పరిమళం

మురళీనగర్–మాధవధార జంట కాలనీలుగా పేరు పొందాయి. ముఖ్యంగా మురళీనగర్ ప్రణాళికాబద్ధంగా రూపొందించారు. అంతే కాకుండా ఈ ప్రాంతం ఆధ్యాత్మికత, ఆహ్లాద వాతావరణాల సమాహారంగా నిలుస్తుంది. ఈ ప్రాంతంలోని వివిధ ఆలయాల్లో నిత్య పూజలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నారు. 13 సెక్టార్లతో విస్తరించిన ఈ అందమైన కాలనీలో అనేక ప్రధాన ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలను దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం వస్తూ ఉంటారు.

- ఆలయాల సమాహారంగా ప్రసిద్ధి చెందిన మురళీనగర్
- నిత్యపూజలతో అనుదినం భక్తిపారవశ్యం

మురళీనగర్: కార్తీక మాసం వచ్చిందంటే చాలు మురళీనగర్‌లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. పండితుల వేద మంత్రోచ్ఛరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. సంక్రాంతి దాటే వరకు ఎక్కడ చూసినా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తులతో సందడి నెలకొంటుంది. ఆధ్యాత్మిక చింతన కోరుకునే వారికి మురళీనగర్ ఒక కేంద్రంగా నిలుస్తోంది.



ఉమారామలింగేశ్వరుడు



లలితాంబికాదేవి



షిర్డీసాయి బాబా



సర్వాంగ వజ్రకవచంతో యోగసిద్ధాంజనేయుడు

రామాలయం.. బహుళ ఆలయాల సమాహారం..



మురళీనగర్ రామాలయం



సీతారామలక్ష్మణుల విగ్రహాలు

మురళీనగర్‌లో రామాలయం అత్యంత ప్రసిద్ధి చెందిందిగా చెప్పుకోవచ్చు. ఇది అనేక ఆలయాల సమాహారంగా నిలుస్తోంది. ఒకే ప్రాంగణంలో నాలుగు ఆలయాలు ఉన్నాయి. రామాలయంలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి నిరంతర పూజలు అందుకుంటున్నారు. భక్తుల పాలిట కల్పవల్లి లలితాంబికా దేవి, ఉమారామలింగేశ్వరాలయం, షిర్డీ సాయి ఆలయం ఇక్కడ ప్రసిద్ధి చెందాయి. ఈ ఆలయానికి వచ్చిన వారు మండపం చుట్టూ నవ దుర్గలు, జ్యోతిర్లింగాలు, అష్టగణపతులు, చండీశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకోవచ్చు. ప్రతి శుక్రవారం లలితా సహస్రనామార్చన, ప్రతి పౌర్ణమికి శ్రీచక్రానికి క్షీరాభిషేకం, ప్రతి మంగళవారం ఆకు పూజ, సోమవారాల్లో ఉమారామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అర్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, మాస శివరాత్రికి రుద్రాభిషేకం, కాశీలో మాదిరిగా ప్రతి రోజూ ప్రత్యేక హారతి నిర్వహిస్తారు. శ్రీరామనవమి ఉత్సవాలు, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి గురువారం షిర్డీ సాయిబాబాకు అభిషేకాలు, ప్రతి గురు పౌర్ణమికి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. కార్తీక మాసం, ధనుర్మాసోత్సవాలతో రామాలయం భక్తులతో కళకళలాడుతుంది. కార్తీక దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

రాష్ట్రంలోనే మొదటిది..

సూర్యానగర్–2 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయం రాష్ట్రంలోనే మొదటిదిగా చెబుతారు. సాలగ్రామ శిలతో తయారు చేసిన యోగ ముద్రలో ఉన్న ఆంజనేయ స్వామి వారికి భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఆగమ శాస్త్ర పండితుడు ఆరవిల్లి సీతారామచార్యులు స్వామిని ప్రతిష్ఠించగా ఆలయ నిర్మాణానికి ధర్మకర్త పి.సుబ్బరాజు సహకరించారు. ప్రతి మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. ఉత్సవాల నిర్వహణ కూడా భారీ ఎత్తున ఉంటుంది. హనుమజ్జయంతి నాడు మనోజ్ఞమారుతి, రథ సప్తమినాడు రాజమారుతి, కార్తీక మాసంలో నవనీత మారుతి అలంకారాల్లో స్వామి దర్శనమిస్తారు. ఇక వట్టాభిరెడ్డి తోటలోని దాసాంజనేయస్వామి మురళీనగర్‌లో వెలసిన మొట్టమొదటి ఆలయంగా పేరుపొందింది. 1990 ఏప్రిల్ 4వ తేదీన గణపతియుక్త దాసాంజనేయ స్వామిని ప్రతిష్ఠించారు. శ్రీరామనవమి ఉత్సవాలు, ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. శ్రావణమాసంలో ప్రతి శుక్రవారం లక్ష్మీదేవికి కుంకుమార్చన, మంగళవారం తమలపాకులతో స్వామికి అర్చన, బుధవారం గణపతికి పంచామృతాభిషేకం, సత్యానగర్‌లోని సోమేశ్వర స్వామి ఆలయం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. కార్తీక మాసంతో పాటు, ప్రతి సోమవారం భక్తుల దర్శనాలతో కిటకిటలాడుతుంది.

వేంకటేశ్వరుడి వైభవం..



వైభవ వేంకటేశ్వరుడు

నగరంలోని ప్రసిద్ధి చెందిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉంది. తిరుపతిలోని మూలవిరాట్టును పోలిన విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయి. విశ్వక్సేనుడు, లక్ష్మీదేవి, గోదాదేవి, గరుడాళ్వారుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. టెఫ్లాన్‌తో రూపొందించిన అత్యంత అధునాతనమైన బేడా మండపం ఆకట్టుకుంటుంది. ఆలయం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గురుత్మంతుడు, ఆంజనేయుడి విగ్రహాలు, ప్రాంగణంలో చుట్టూ ఏర్పాటు చేసిన వివిధ పురాణ ఘట్టాలకు చెందిన విగ్రహాలు ఆకట్టుకుంటాయి. దసరాకు త్రిరాత్రి ఉత్సవాలు, దీపారాధన, కార్తీక మాసంలో ఆకాశ దీపారాధన, వైభవుని వసంతోత్సవం ప్రత్యేకంగా నిలుస్తాయి. డిసెంబరు నుంచి జనవరి వరకు నిర్వహించే ధనుర్మాసోత్సవాలు, వైకుంఠ ఏకాదశినాడు ఆలయ ఉత్తర ద్వార దర్శనం, జనవరి 14న నిర్వహించే స్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ పర్వదినాల్లో వేలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి వస్తారు. ప్రతి శనివారం ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించి, ఆరోజు అన్నదాన సత్రంలో 300 మందికి అన్నప్రసాదం అందిస్తారు. గో పూజ చేస్తారు. ఆన్‌లైన్ దర్శనం విధానాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారు.



వైభవుడి ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆంజనేయుడు, గరుత్మంతుడు

నందగిరికాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి నందగిరినగర్‌లో ఆదివారం లక్ష్మీ గాయత్రి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీగాయత్రి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కేవీ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల వివిధ ప్రాంతాల్లో పేదవారికోసం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు, అవసరం ఉన్నవారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాలనీలో గల సుమారు 100 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ రమేష్, ఉద్యోగులు సురేష్, దినేష్, మేఘనతో పాటు నందగిరినగర్ సేవా సంఘం అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, సెక్రటరీ బసవ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపులో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సత్ప్రవర్తన కలిగి ఉండాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్తు టౌన్ సీఐ విజయకుమార్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఫోర్తుటౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురు రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫోర్తుటౌన్‌లో..

ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ చేశారు. రౌడీషీటర్లు హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా గెడ్డల నిర్వహణ



నరేంద్రనగర్‌లో ఇళ్ల మధ్య డ్రైయిన్‌లో పేరుకుపోయిన చెత్త



నరేంద్రనగర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు పరిధి నరేంద్రనగర్ గెడ్డ నిర్వహణ అధ్వానంగా మారింది. సక్రమంగా వ్యర్థాలు తొలగించపోవడంతో గెడ్డలో పెద్ద ఎత్తున మురుగు పేరుకుపోయింది. ఈ గెడ్డకు ఆనుకుని ఒకవైపు నందగిరినగర్, మరొకవైపు నరేంద్రనగర్ కాలనీలు ఉన్నాయి. గెడ్డకు రెండు వైపులా వందల సంఖ్యలో నివాసితుల ఇళ్లు ఉన్నాయి. నరేంద్రనగర్ గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, జ్వరాల బారిన పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గెడ్డ నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్ల రెండు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నరేంద్రనగర్‌లో ఇళ్ల వరుసల మధ్య ఉన్న డ్రైయిన్‌లో చెత్త పేరుపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్ అండ్ బీ స్థలంలో ఆక్రమణలు



ఆర్ అండ్ బీ స్థలంలో కట్టిన దేవాలయం



ఆర్ అండ్ బీ స్థలంలో కార్ మెకానిక్ షెడ్డు

సీతమ్మధార: స్థానిక రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) కార్యాలయం సమీపంలో ఉన్న స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఇక్కడి ఆర్ అండ్ బీ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో ఒక వ్యక్తి గుడి పేరిట ఆక్రమణలకు పాల్పడినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ ఆంజనేయస్వామి గుడి పేరిట ఆక్రమణలు చేయడం గమనార్హం. ప్రభుత్వ స్థలమే అయినా సదరు వ్యక్తి ఇక్కడ దర్జాగా గుడి కట్టేశారు. ఇక్కడ పూజలు, పర్వదినాలలో హోమాలు కూడా జరుగుతున్నాయి. బయటి వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నా సరే పక్కనే వున్న ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది.

దర్జాగా కారు మెకానిక్ షెడ్ ఏర్పాటు..

ఆర్ అండ్ బీ ఏఈ కార్యాలయానికి సమీపాన గల స్థలంలో కొందరు వ్యక్తులు దర్జాగా మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఆర్ అండ్ బీ క్వార్టర్లకు సమీపంలో గల ఖాళీ స్థలంలో ఏళ్ల తరబడి మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నారు. మొదట్లో కొన్నాళ్ళు అద్దె కట్టినా, తర్వాత అదీ లేదు. ఈ విషయమై తీవ్ర దుమారం రేగుతోంది. ఇక్కడ కార్ల మరమ్మతు చేస్తారు. దీంతో ఇక్కడ పెద్ద సంఖ్యలో కార్లు పార్కింగ్ చేస్తుంటారు. ఒక వైపు గుడి, మరోవైపు కార్ మెకానిక్ షెడ్డు నిర్వహణతో ఆర్ అండ్ బీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ విషయమై ఆర్ అండ్ బీ అసిస్టెంట్ ఇంజినీర్ భార్గవిని 'సాక్షి' వివరణ కోరగా, ఇక్కడి స్థలంలో గుడి నిర్మాణ విషయమై ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే కార్ మెకానిక్ షెడ్డు ఆక్రమణ గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



చికిత్స చేస్తున్న డాక్టర్ వెంకటరమణమూర్తి, సిబ్బంది

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులోని మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సంఘ సేవకులు సనపల సూర్యనారాయణ 18వ వర్ధంతి సందర్భంగా మురళీనగర్ తెన్నేటి పార్కులో ఆదివారం కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సుమారు 500 మందికి పైగా రోగులకు చికిత్స అందించి, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశామన్నారు. అలాగే ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించామన్నారు. సుమారు 50 మంది పాల్గొని రక్తదానం చేశారన్నారు. అనంతరం డాక్టర్ వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సభ్యులు ఆయనను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు హనుమత్ యజ్ఞం

మహారాణిపేట: ఎంవీపీ కాలనీ భద్రం కమ్యూనిటీ హాల్లో సోమవారం హనుమత్ యజ్ఞం భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. కందాల శ్యామ్, అరుణా గాయిత్రీ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొంకోట గురువులు రేజేటీ రామాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతుంది. 13న వాసవీ క్లబ్ నిర్వహణలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ సుమారు 4 వేల మంది భక్తులతో నిర్వహించనున్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న నరసింగరావు

సీతంపేట: భారత రాజ్యాంగాన్ని మార్చివేసే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయని, ఆ ప్రక్రియను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేషనల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం.నరసింగరావు పిలుపునిచ్చారు. రామా టాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం, దేశాన్ని కాపాడుకుందాం పిలుపుతో దేశంలోని పలు రాష్ట్రాల్లో రాజ్యాంగ అవగాహన రథయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా యాత్ర పోస్టర్ విడుదల చేశారు. దేశంలో 4 వేల కిలో మీటర్ల దూరం యాత్ర సాగుతుందని, ఆంధ్రా, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర మీదుగా నాగపూర్ దీక్షా భూమికి చేరుకుంటుందని తెలిపారు. యాత్రలో దళిత, బహుజన, ప్రజా సంఘాలన్నీ భాగస్వామ్యం కావాలన్నారు. ఏయూ నుంచి పీహెచ్‌డీ అందుకున్న మాటూరి రత్నకుమారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు జి.శంకర్, ఎస్.రామలింగం, ముని కుమార్, జాన్ పాల్, ఎం.రాజ్‌కృష్ణ, ఏఎంసీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, డి.భూపతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

మహారాణిపేట: నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న మహారాణిపేట నాక్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మేళాలో వీల్స్‌మార్ట్, 2 నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్, పే–టీమ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 9676170026 సంప్రదించాలన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: స్వాతంత్ర్య సమరయోధునిగా, దేశ మొదటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాల ఆవరణలో గల గాంధీ సెంటర్‌లో 'నెహ్రూ అండ్ ఇండియా' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా దేశంలో ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల నిర్మాణం, పంచశీల విధానం, ప్రపంచ శాంతి స్థాపన, ప్రభుత్వరంగ సంస్థల నిర్మాణంలో నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసారు. ఆచార్య పి. పద్దయ్య, సీనియర్ న్యాయవాది సి.ఎస్.పి.కృష్ణారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత దేశ నిర్మాణంలో నెహ్రూ కీలక బాధ్యతలు వహించారన్నారు. భారత నవ నిర్మాణంలో నెహ్రూ పాత్ర గుర్తించదగినదని, కొందరు పనికట్టుకుని నెహ్రూని, గాంధీని అసహ్యాకరంగా సోషల్ మీడియాలో చూపించడం , మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటించారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాబ్జి, ద్విభాష్యం రాజేశ్వరరావు, జె.పి.శర్మ, హుస్సేన్, రచయిత ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల ప్రోత్సాహంతోనే బాలల అభివృద్ధి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: బాలలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ మాజీ డైరెక్టర్ బి. రమేష్ ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు హాజరవుతున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ బాల కళాకారులకు ఆదివారం ఉదయం సీతమ్మధార ఏపీఎస్ఈబీ కమ్యూనిటీ హాల్లో ఘనంగా సత్కరించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజం కోసం పాటుపడే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నవంబర్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభావంతులైన బాలలను సత్కరించాలన్నారు. విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, సింహాచలం ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రధాని, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న చిన్నారులకు సైతం విశాఖలో తగిన గుర్తింపు లేదన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా నేషనల్ కల్చరల్ ఫెస్టివల్‌కు హాజరవుతున్న హర్షిత టీనా, పూజిత చందన, జోషిత, డింపుల్, స్నేహితలను సత్కరించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి, కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజ్ పట్నాయక్, ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ చైర్మన్, సింగర్ కె. రామారావు తదితరులు పాల్గొన్నారు.